సిమెంట్ రోడ్డు వేసేదెన్నడో?

● పైపులైన్ లీకేజీ.. అరికట్టేందుకు రహదారిని పగులగొట్టిన వైనం
● పనులు పూర్తయ్యాక మట్టి పోసి చదును
● జీహెచ్‌ఎంసీ, జలమండలి శాఖల సమన్వయం లోపం
● దాయార మార్కెట్ చౌరస్తా నుంచి రాజాడీలక్స్ చౌరస్తా వరకు ఉన్న రోడ్డు అధ్వానం


అధ్వానంగా మారిన దాయార మార్కెట్ రోడ్డు


వర్షానికి బురదమయంగా మారిన సాగర్‌లాల్ రోడ్డు

తాగునీటి పైను లీకేజీ వల్ల సీసీ రోడ్డు పగులగొట్టారు. పనులు పూర్తయ్యాక మట్టి పోసి చదును చేశారు. ఇక్కడే జలమండలి, జీహెచ్‌ఎంసీ అధికారులు సమన్వయం లోపించింది. కేవలం పాచ్‌వర్క్ పనులే చేపట్టాగమని జలమండలి శాఖాధికారులు అంటున్నారు. రోడ్డు నిర్మాణం చేపట్టాలంటే నిధులు రావాలని వచ్చిన తర్వాత చేపడుతామని జీహెచ్‌ఎంసీ చెబుతున్నది. ఒకరిపై మరొకరు చెప్పుకుంటూ ఐదు నెలల సమయం గడిచిపోయింది. ప్రస్తుతం ఆ రోడ్డు నిర్మాణం ఎప్పుడు చేపడుతారో? తెలియదు కానీ స్థానికులు, వ్యాపారులు మాత్రం ఇబ్బందులు పడుతున్నారు. వర్షం వస్తే రోడ్డంతా బురద.. ఎండొస్తే విపరీతమైన దుమ్ముధూళి పైకి లేస్తుందని వాపోతున్నారు.

ముషీరాబాద్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : ముషీరాబాద్ ప్రధాన రోడ్డులో తాగునీటి లీకేజీని అరికట్టేందుకు గత సంవత్సరం నవంబర్‌లో రూ.3.66 కోట్లతో వెయ్యి ఎంఎం భారీ తాగునీటి పైప్‌లైన్ నిర్మాణ పనులను దాయార మార్కెట్ చౌరస్తా నుంచి సాగర్‌లాల్ ఆస్పత్రి చౌరస్తా వరకు చేపట్టారు. సుమారు 650 మీటర్ల పైప్‌లైన్ నిర్మాణ పనులు దాదాపుగా పూర్తయ్యాయి. సాగర్‌లాల్ చౌరస్తా వద్ద పైప్‌లైన్‌కు జంక్షన్ నిర్మాణ పనులు సైతం పూర్తయ్యాయి. రోడ్డు మధ్యలో తవ్వి మట్టి వేసి చదును చేశారు. దీంతో సీసీరోడ్డు పనులు చేపట్టకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయమై ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. అయినా ప్రయోజనం చేకూరలేదని వాపోయారు.

వర్షం కురిస్తే రోడ్డంతా బురద... ఎండొస్తే విపరీతమైన దుమ్ము

తాగునీటి పైప్‌లైన్ నిర్మాణ పనులు నిమిత్తం రోడ్డు మధ్యలో తవ్వారు పనులు పూర్తికాగానే మట్టితో చదును సైతం చేశారు. కానీ ఎండకు గాలి తోడవ్వడం.. పైగా మట్టిరోడ్డు కావడంతో దుమ్మూధూళి లేస్తున్నది. అడపాదడపా వర్షాలకు బురదమయంగా మారుతున్నది. స్థానికంగా నివసించే ప్రజలు, వ్యాపారులు, పాదచారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రంజాన్ పండుగకు ముందు రోడ్డుపై విపరీతమైన దుమ్ములేస్తుందని జలమండలి అధికారులకు స్థానికులు ఫిర్యాదు చేశారు. రోడ్డుపై మోటార్ల సహాయంతో నీటిని చల్లారు. అధ్వానంగా మారిన రోడ్డుతో ఐదు నెలలుగా జనం ఇబ్బంది పడుతున్నారు.

సమన్వయ లోపంతో..

జీహెచ్‌ఎంసీ, జలమండలి అధికారుల సమన్వయ లోపం కనిపిస్తున్నది. మంచినీటి పైప్‌లైన్ నిర్మాణ పనులు పూర్తి అయ్యాయని జలమండలి అధికారులు అంటున్నారు. చిన్న చిన్న ప్యాచ్‌వర్క్ పనులైతే చేపడుతామని జలమండలి అధికారులు తెలిపారు. రోడ్డు నిర్మాణానికి నిధులు విడుదల కావాలని అప్పుడే తాము రోడ్డు పనులు చేపడుతామని జీహెచ్‌ఎంసీ అధికారులు పేర్కొంటున్నారు.

దుమ్ముతో వ్యాపారం చేసుకోలేకపోతున్నాం


రోడ్డు అధ్వానంగా ఉండటంతో దుమ్ములేస్తున్నది. షాపులో కూర్చోలేకపోతున్నాం. కష్టమర్లు సైతం షాపునకు రావడం తగ్గారు. అధికారులకు ఫిర్యాదు చేసినా సమస్య పరిష్కరించడం లేదు.

- సలీం, స్థానిక చికెన్ సెంటర్ వ్యాపారి

అవస్థలు పడుతున్నాం


దాయార మార్కెట్ నుంచి సాగర్ లాల్ ఆస్పత్రి వరకు అధ్వానంగా ఉన్న రోడ్డు వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. గుంతలమయంగా మారిన రోడ్డు వల్ల అవస్థలు పడుతున్నాం.

పట్నం నాగభూషణం గౌడ్, స్థానికుడు


జగన్‌ను సత్కరిస్తున్న దక్షిణ భారత అడ్వకేట్ జేఏసీ అధ్యక్షుడు నాగేందర్

సుప్రీం రీజినల్ బెంచ్ ఏర్పాటుకు కృషి

● హైకోర్టు బార్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడు జగన్

బర్కత్‌పుర, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్‌లో సుప్రీంకోర్టు రీజినల్ బెంచ్ ఏర్పాటుకు తన వంతు కృషి చేస్తానని హైకోర్టు బార్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడు ఏ.జగన్ అన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా విజయం సాధించిన సందర్భంగా మంగళవారం దక్షిణ భారత అడ్వకేట్ జేఏసీ అధ్యక్షుడు సుధా నాగేందర్ ఆధ్వర్యంలో ఆయనను శాలువా, పూలబొకేలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానన్నారు. సుధా నాగేందర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం వెంటనే సుప్రీంకోర్టు రీజినల్ బెంచ్ ఏర్పాటు చేస్తూ ఆదేశాలు జారీ చేయాలని కోరారు. కార్యక్రమంలో జీ.పీ.రాజేష్‌నేత, న్యాయవాదులు వరుణ్, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

బీఎస్‌ఎన్‌ఎల్ కస్టమర్ సర్వీస్ క్యాంప్

బర్కత్‌పుర, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : బీఎస్‌ఎన్‌ఎల్ ఆధ్వర్యంలో ఈ నెల 17న కస్టమర్ సర్వీస్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు మంగళవారం బీఎస్‌ఎన్‌ఎల్ డీజీఎం ఎం.నర్సింహులు తెలిపారు. ఇదే రోజు ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు మాజీ ఎంపీ వి.హనుమంతరావు నివాస సమీపంలోని ఎస్‌బీఐ బ్యాంకు వద్ద కస్టమర్ సర్వీస్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బీఎస్‌ఎన్‌ఎల్ వివిధ సర్వీసుల వివరాలు, వినియోగదారులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడానికి ఈ క్యాంప్ ఎంతో దోహదపడనుందని పేర్కొన్నారు. వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

దొంగకు ఆరు నెలల జైలుశిక్ష

బర్కత్‌పుర, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): దొంగకు రైల్వే కోర్టు ఆరునెలల జైలు శిక్ష విధించిందని కాచిగూడ రైల్వే పీఎస్ సీఐ ఎల్లప్ప తెలిపారు. రంగారెడ్డి జిల్లా బాలాపూర్ షహీన్‌నగర్ ఎర్రగుంటలో నివాసం ఉంటున్న మహ్మద్ ఆయాన్ ఆలియాస్ సయ్యద్ ఆయాన్ (22) ఫంక్షన్ హాల్స్‌లో డెకరేషన్ వర్క్ చేస్తూ రైలులో సెల్‌ఫోన్ దొంగతనాలకు పాల్పడుతుంటాడు. ఇటీవల ఫలక్‌నామా - కాచిగూడ రైల్వే స్టేషన్ల మధ్య సెల్‌ఫోన్ దొంగతనం జరిగింది. ప్రయాణికుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని ఆయాన్‌ను పట్టుకుని మంగళవారం రైల్వే కోర్టులో హాజరుపరచగా మేజిస్ట్రేట్ ఎం.డీ.గౌస్‌పాషా నిందితుడికి ఆరు నెలల సాధారణ జైలు శిక్ష విధించారని తెలిపారు.


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఆచార్య ఇనాక్, కళా జనార్దనమూర్తి

మహనీయుడు బీఆర్ అంబేడ్కర్

చిక్కడపల్లి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): చైతన్యవంతమైన జీవితం దళితులకే కాకుండా శ్రామికులకు కూడా ఉండాలని ప్రణాళికలను రూపొందించిన మహనీయుడు అంబేడ్కర్ అని శ్రీవేంకటేశ్వర యూనివర్శిటీ మాజీ వీసీ ఆచార్య కొలకలూరి ఇనాక్ అన్నారు. మంగళవారం గానసభలో జరిగిన కార్యక్రమంలో ప్రముఖ రచయిత జయసూర్య రచించిన భారతరత్న డా. బాబాసాహెబ్ అంబేడ్కర్ జీవిత చరిత్ర పుస్తకావిష్కరణ సభ గానసభ అధ్యక్షుడు కళా జనార్దన మూర్తి అధ్యక్షతన జరిగింది. పుస్తకాన్ని ఆవిష్కరించిన ప్రొ. ఇనాక్ మాట్లాడుతూ అంబేడ్కర్ కేవలం దళితుల పక్షపాతి అని అనుకుంటారని కానీ భారతీయులలో చైతన్యం తీసుకు రావడానికి జనాలందరినీ ప్రేమించిన వ్యక్తిగా ఆయనను గుర్తుంచుకోవాలని అన్నారు. కార్యక్రమంలో సంఘసేవకులు భవాని శ్రీనివాస్, కోళ్ల సుధాకర్, పాత శివకుమార్(జగన్), వీణాపాణి పాల్గొన్నారు.

సుప్రీంకోర్టు తీర్పు హర్షణీయం

కవాడిగూడ, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : గవర్నర్ పంపే బిల్లులపై మూడు నెలల్లోగా నిర్ణయం తీసుకోవాలంటూ రాష్ట్రపతికి గడువు విధిస్తూ సుప్రీంకోర్టు తీర్పునివ్వడం అభినందనీయమని తెలంగాణ అడ్వకేట్ జేఏసీ చైర్మన్ పులిగారి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం కవాడిగూడలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజ్యాంగం ముందు అందరూ సమానమేనని ఈ తీర్పుతో మరోసారి సుప్రీం తన ప్రత్యేకత చాటుకుందన్నారు. గవర్నర్ పంపేబిల్లుల్లో రాజ్యాంగ విరుద్ధ అంశాలు ఉన్నట్లు భావిస్తే సుప్రీంకు పంపి సలహాలు తీసుకోవాలని సూచించిందన్నారు. గడువులోగా రాష్ట్రపతి నిర్ణయం తీసుకోకపోతే రాష్ట్రప్రభుత్వాలు కోర్టులను ఆశ్రయించవచ్చని కూడా తెలిపిందని పేర్కొన్నారు. ఈతీర్పుతో పార్టీలు మారే ప్రజాప్రతినిధులకు కళ్లెం వేసినట్లవుతుందన్నారు. అధికార రాజకీయ పార్టీలు ఆడే ఆటకు మూడునెలల్లోగా ముగింపు పలకవచ్చని పేర్కొన్నారు.


బాలలతో వినయ్‌కుమార్, జైసింహ, కృష్ణ తదితరులు

క్రీడలతో ఉజ్వల భవిష్యత్

చిక్కడపల్లి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): చదువుతోపాటు క్రీడల్లో ప్రావీణ్యం పొందినప్పుడే బాలలకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం జాయింట్ కన్వీనర్ ఎ. వినయ్‌కుమార్, బీఆర్‌ఎస్ యువ నేత ముఠా జైసింహ అన్నారు. గాంధీనగర్ డివిజన్‌లో ఉన్న జీహెచ్‌ఎంసీ గ్రౌండ్‌లో తైక్వాండో మార్షల్ ఆర్ట్స్ అసోసియేషన్ హైదరాబాద్ 18వ వార్షికోత్సవ వేడుకలు మంగళవారం జరిగాయి. ఈ సందర్భంగా శిక్షణ పొందిన 50 మంది విద్యార్థులకు బ్లాక్ బెల్ట్ సర్టిఫికెట్‌లు, బహుమతుల ప్రదానం జరిగింది. కార్యక్రమం మార్షల్ ఆర్ట్స్ అసోసియేషన్ హైదరాబాద్ అధ్యక్షుడు మాస్టర్ బి. కృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో కోచ్‌లు సంజయ్, రఘు, మనీష్ యాదవ్, రాకేష్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

సాంస్కృతిక సంస్థల కృషి అభినందనీయం

చిక్కడపల్లి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): సాంస్కృతిక సంస్థలు కళావికాసానికి ఎక్కువగా కృషి చేయడం అభినందనీయమని తెలంగాణ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ పూర్వ ఛైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా అన్నారు. ప్రతిభను ప్రోత్సహిస్తూ ఉన్నతులైన వారిని గౌరవించినపుడే నిజమైన ఉగాది అని అన్నారు. శిఖరం ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో త్యాగరాయగానసభలో మంగళవారం జరిగిన నాట్య వసంతోత్సవం ఉగాది స్వర్ణనంది పురస్కారాల ప్రదానోత్సవం కార్యక్రమం జరిగింది. అనంతరం ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన, ఎన్విరాన్‌మెంట్ ప్రొటెక్షన్ అండ్ డెవలప్‌మెంట్ సొసైటీ ఛైర్మన్ కోమటిరెడ్డి గోపాల్ రెడ్డి మాట్లాడుతూ మన సంస్కృతీ సంప్రదాయాలను ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత నేటితరంపై ఉందన్నారు. దైవజ్ఞశర్మ, హెచ్‌ఎండీఏ అసిస్టెంట్ డైరెక్టర్ డి. చక్రపాణి, కథక్ గురువు అంజిబాబు, దామోదరం నాగేందర్ పాల్గొనగా రచయిత్రి ముక్తేవి భారతి, నాట్యాచార్యులు చలపతిశాస్త్రిలకు జీవిత సాఫల్య స్వర్ణనంది అవార్డులు, అంజనీకుమారి, బి.రమాదేవి, కామంచి శారద, గ్రంధి కృష్ణమూర్తి,నాట్యగురువులు టి. కళ్యాణి, భవ్యసాయిశేషభట్టార్, రజిత ఆచార్య, ఎస్ శ్వేత, శైలజవడ్డానం, వసుమతి, క్రీడాకారులు మహంతి ఉజ్వల్‌నాయుడు, ఉప్పల పవన్‌రాజ్‌లకు ఉగాది స్వర్ణనంది అవార్డులు ప్రదానం చేశారు.

నిరుపేదలందరికీ ఇంటి స్థలం ఇవ్వాలి

● రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య


పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఆర్.కృష్ణయ్య, నీల వెంకటేష్ తదితరులు

రాంనగర్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో నివసించే ఇల్లు లేని నిరుపేదలందరికీ 100 గజాల ఇంటి స్థలం కేటాయించడంతోపాటు పట్టా కూడా ఇవ్వాలని రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అర్హులకు 100 గజాల ఇంటి స్థలం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ గుడిసె వాసుల సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 26న ఇందిరా పార్కు వద్ద వేలాది మందితో భారీ ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి బీసీ సంక్షేమ సంఘం మద్దతు ఇస్తున్నట్లు తెలిపారు. ఆ మేరకు మంగళవారం విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో గుడిసె వాసుల సంఘం అధ్యక్షుడు బి.రవియాదవ్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు నీల వెంకటేష్‌లతో కలిసి ఆయన.. వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. నగరం చుట్టుపక్కల గల సింగారం, తట్టి అన్నారం, ఆర్‌కె.నగర్, కుంట్లూరుతోపాటు అనేక ప్రాంతాలలో ప్రభుత్వ ఖాళీ స్థలాలు ఉన్నాయన్నారు. వాటిని ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు నీలవెంకటేష్, జిల్లపల్లి అంజి, వి.ఎన్.రమేష్, కౌశల్, మణికంఠ, పగిల్ల సతీష్, మోదీరాందేవ్, నవీన్, నాగరాజు, ఉపేందర్, సోమయ్య, బాబు తదితరులు పాల్గొన్నారు.

నాట్యం ఒక సముద్రం

● మే నెలలో సకల కళల నృత్య సమ్మేళనం
● ప్రజా సాంస్కృతిక వేదిక అధ్యక్షుడు వెంకటేశ్వర్లు


అభివాదం చేస్తున్న భూపతి వెంకటేశ్వర్లు, నృత్యగురువులు

రాంనగర్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : నాట్య కళలు సాంస్కృతిక వికాసానికి, నాగరికతకు చిరునామాలు అని తెలంగాణ ప్రజా సాంస్కృతిక వేదిక అధ్యక్షుడు భూపతి వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. మంగళవారం సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో తెలంగాణ ప్రజా సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో భారతీయ నృత్య గురువుల సమావేశం చినుకు కల్చరల్ సొసైటీ అధ్యక్షుడు పి.ఎన్.మూర్తి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతీయ నృత్యాలన్నీ ఒకే వేదిక మీద ప్రదర్శించి సార్వత్రికను చాటడం అవసరం అన్నారు. ప్రజలు, పిల్లలకు మంచి విలువలు కల్పించడం సకల కళల సమ్మేళనం అన్నారు. నాట్యం గొప్ప శాస్త్రం అది ఒక సముద్రం వంటిదని, దానిని విశ్వవ్యాప్తం చేయాలనే సంకల్పంతో తెలంగాణ ప్రజా సాంస్కృతిక వేదిక కృషి చేస్తోందన్నారు. ఈ మేరకు సకల కళల నృత్య సమ్మేళనం మే నెల మూడవ వారంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. శాస్త్ర నృత్య కళలకు ప్రజా పాటల పౌరుషాన్ని అద్దితే అదే తెలంగాణ ప్రజా సాంస్కృతిక వేదిక అవుతుందన్నారు. కళలన్నీ ప్రజల వద్దకే వెళ్లాలని మంచి చెడుల నిర్ణయాలు ప్రజలే నిర్ణయిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో నృత్య గురువులు వరుణ్, కృష్ణ, పవన్, లావణ్యయోగా, రాధిక, శ్రీనివాస్, కె.రమాదేవి, పి.లక్ష్మీదేవి, సౌజన్య, నిఖిలేష్ తదితరులు పాల్గొన్నారు.

రైలు ప్రయాణికురాలి బ్యాగ్ చోరీ

బంగారు రింగులు, నగదు తస్కరణ

బర్కత్‌పురా ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): రైలు ప్రయాణికురాలి బంగారు రింగులు, నగదు ఉన్న హ్యాండ్ బ్యాగ్‌ను దొంగలు తస్కరించారు. కాచిగూడ రైల్వే సీఐ ఎల్లప్ప వివరాల ప్రకారం.. నగరంలోని మల్లాపూర్ గోకుల్‌నగర్‌లో నివాసముంటున్న శివకుమార్ వర్మ భార్య నిర్మలతో కలిసి ఉజ్జయినిలో యశ్వంతపూర్ స్పెషల్ రైలు ఎక్కారు. మధ్యప్రదేశ్‌లోని ఇటార్సీ రైల్వేస్టేషన్ వద్దకు రాగానే నిర్మల హ్యాండ్ బ్యాగ్ కనిపించలేదు. అందులో 9 గ్రాముల బంగారు రింగులు, 20 వేల నగదు, సెల్ ఫోన్ ఉంది. మంగళవారం రాత్రి రైలు కాచిగూడ రైల్వేస్టేషన్‌కు చేరుకోగానే శివ కుమార్ వర్మ రైల్వే పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని తదుపరి విచారణ నిమిత్తం ఇటార్సీ రైల్వే పీఎస్‌కు బదిలీ చేసినట్లు సీఐ ఎల్లప్ప తెలిపారు.

రాజీవ్ యువ వికాసం దరఖాస్తు గడువు పొడిగించాలి


దశరథ్

చిక్కడపల్లి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): రాజీవ్ యువవికాసం పథకం దరఖాస్తు చేసే గడువును పొడిగించాలని తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రచార కార్యదర్శి జంగం దశరథ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం చిక్కడపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నాలుగు రోజులుగా రాజీవ్ యువ వికాసం పథకం కోసం దరఖాస్తు చేసేందుకు ఆన్‌లైన్ పోర్టల్‌లోకి వెళ్లిన వారికి నిరాశే ఎదురవుతోందన్నారు. సర్వర్ బిజీ, సర్వర్ డౌన్ అంటూ మెసేజ్‌లు వస్తున్నాయన్నారు. దీనివల్ల అనేకమంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఈడబ్ల్యుఎస్ నిరుద్యోగులు దరఖాస్తు చేసుకోలేదన్నారు. సెలవులు రావడంతో తహసీల్దార్ కార్యాలయాల్లో ఇన్‌కం, కుల ధ్రువీకరణ పత్రాలు చాలా మంది నిరుద్యోగులకు అందలేదన్నారు. అయితే ఆ పత్రాలు తెచ్చుకున్నవారేమో.. సర్వర్ డౌన్ కావడంతో దరఖాస్తు చేసుకోలేకపోయారన్నారు. ఇప్పటికైనా సర్వర్‌లో పొరపాట్లు సరిదిద్ది దరఖాస్తు చేసుకునే గడువును పెంచాలని దశరథ్ కోరారు. సమావేశంలో టీడీపీ నేతలు భవాని శ్రీనివాస్, నైషధం సత్యనారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

రవాణా రంగంపై వివక్ష తగదు

● తెలంగాణ ఆల్ ప్రైవేట్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ యూనియన్ గ్రేటర్ అధ్యక్షుడు దయానంద్
● 22న ఇందిరా పార్కు వద్ద ధర్నాకు పిలుపు

బర్కత్‌పుర, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : రవాణా రంగ కార్మికుల అభివృద్ధికి ప్రత్యేక వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని పలుమార్లు రాష్ట్రంలోని అన్ని యూనియన్లు సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు, సంబంధిత అధికారులకు విన్నవించినా కాలయాపన చేస్తున్నారని తెలంగాణ ఆల్ ప్రైవేట్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ యూనియన్ గ్రేటర్ అధ్యక్షుడు ఎన్.దయానంద్ మండిపడ్డారు. మొన్న వచ్చిన గిగ్ వర్కర్స్ కోసం ఒక ముసాయిదా బిల్లును తయారు చేయాలని ప్రభుత్వం అధికారులను ఆదేశించడంపై తగదని అన్నారు. మంగళవారం నారాయణగూడలో యూనియన్ నాయకులు నరసింహరెడ్డి, మల్లేష్‌గౌడ్, బి.రామకృష్ణారెడ్డిలతో కలిసి ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోని ట్రేడ్ యూనియన్ నాయకులను సంప్రదించకుండా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకోవడం సరికాదన్నారు. ఇప్పటికైనా అన్ని యూనియన్ నాయకులతో సమావేశం ఏర్పాటు చేయాలన్నారు. ఆపై మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఎలాంటి ఆదాయం ఇవ్వని గిగ్ వర్కర్స్‌కు సంబంధించిన ముసాయిదా బిల్లును తయారు చేయడం ఏమిటని ప్రశ్నించారు. ప్రభుత్వానికి లక్షల్లో ఆదాయాన్ని సమకూరుస్తున్న రవాణా రంగంపై ప్రభుత్వం వివక్ష చూపడం సరికాదన్నారు. తొలుత తమ సమస్యలకు పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. డిమాండ్ల సాధన కోసం ఈ నెల 22న ఇందిరా పార్కు వద్ద రవాణా రంగ కార్మికులతో పెద్దఎత్తున ధర్నా నిర్వహిస్తామన్నారు.

29న అవార్డుల ప్రదానోత్సవం

రాంనగర్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ మ్యారేజ్ బ్యూరో మీడియేటర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 29న రవీంద్రభారతిలో మ్యారేజ్ బ్యూరో రత్న, ఉత్తమసేవా రత్న, శ్రమశక్తి అవార్డుల ప్రదానోత్సవం జరుగుతోందని ఆ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు బుర్ర శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు మంగళవారం సాయంత్రం సుందరయ్య విజ్ఞానకేంద్రంలో అవార్డుల ప్రదానం బ్రోచర్‌ను ఆవిష్కరించారు. మ్యారేజీ బ్యూరోలు సేవాభావంతో వివాహాలు జరిపించి సమాజానికి తమవంతు సేవలందిస్తున్నారని అన్నారు. నాలుగు సంవత్సరాలుగా ఈ అవార్డులను ఇస్తున్నామని తెలిపారు. లక్ష్మీనారాయణ గౌడ్, గడ్డమీద అనురాధగౌడ్, ప్రతినిధులు పాల్గొన్నారు.


బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న శ్రీనివాస్‌గౌడ్ తదితరులు


చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

దాహార్తిని తీర్చేందుకే చలివేంద్రాలు

● ఎమ్మెల్యే ముఠా గోపాల్

రాంనగర్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చడానికి చలివేంద్ర కేంద్రాలు ఎంతో దోహదపడతాయని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ పేర్కొన్నారు. మంగళవారం మాత వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో వీఎస్టీ రోడ్డులోని శ్రీకట్టమైసమ్మ ఆలయం వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. బాటసారులకు దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేసిన మాత వాకర్స్ క్లబ్‌ను అభినందించారు. చలివేంద్రంలో నీరు, మజ్జిగను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వాసవి ఆస్పత్రి ప్రధాన కార్యదర్శి కొండ్లె మల్లికార్జున్ గుప్తా, వాసవి సేవా కేంద్రం సలహాదారు కాసనగొట్టు రాజశేఖర్‌గుప్తా, వాకర్స్ ఇంటర్నేషనల్ హైదరాబాద్ డిస్ట్రిక్ట్ 301 గవర్నర్ లింగా ప్రకాష్‌గుప్తా, సంస్థ అధ్యక్షుడు బొమ్మిడి శ్రవణ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి మారం సురేష్‌బాబు, ఉపాధ్యక్షుడు డాక్టర్ నీలా శ్రీధర్, కోశాధికారి గాజర్ల నగధర్, జాయింట్ సెక్రటరీ కేశవ చంద్ర, డిప్యూటీ గవర్నర్ డాక్టర్ వై.మురళీధరుడు, సలహాదారు కేశవరావు దేశ్‌పాండే తదితరులు పాల్గొన్నారు.



● **సన్మానం**

డీఎంసీ రామానుజరెడ్డి, అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ ప్రవీణ్ చంద్రాలను భోలక్‌పూర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ వాజీద్ హుస్సేన్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మంగళవారం సన్మానించారు. రంజాన్ మాసంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకున్నందుకు గాను కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం నియోజకవర్గంలోని ఆరు డివిజన్ల జీహెచ్‌ఎంసీ ఎస్‌ఎఫ్‌ఏలను సైతం సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మహ్మద్ రహీం ఉద్దీన్, చాంద్‌ఖాన్, యూసూఫ్, అబ్దుల్ లతీఫ్, మహ్మద్ మసూద్ పాల్గొన్నారు.

ముషీరాబాద్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి):


బ్రోచర్, నూతన సంవత్సరం క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న వివేక్ వెంకటస్వామి

బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి అంబేడ్కర్

● ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి

బర్కత్‌పుర, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీ.ఆర్.అంబేడ్కర్ బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి, సామాజిక న్యాయం కోసం జీవితాంతం పోరాడిన మహనీయుడు అని ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు గోపోజు రమేష్‌బాబు ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సరం క్యాలెండర్, అంబేడ్కర్ చరిత్ర బ్రోచర్‌ను మంగళవారం ఆయన ఆవిష్కరించారు. అణగారిన వర్గాల హక్కుల కోసం అంబేడ్కర్ నిరంతరం పోరాడారని గుర్తు చేశారు. కార్యక్రమంలో నాయకులు కొండ్రరాజలింగం, కృష్ణమూర్తి, శ్రీకాంత్, అనిల్, చేతన్‌కుమార్ పాల్గొన్నారు.

గ్రంథాలయానికి భారత రాజ్యాంగ పుస్తకాల వితరణ

రాంనగర్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీ.ఆర్.అంబేడ్కర్ రాసిన వంద భారత రాజ్యాంగ పుస్తకాలను కాంగ్రెస్ సీనియర్ నాయకుడు పాత శివకుమార్ (జగన్) నగర కేంద్ర గ్రంథాలయానికి అందజేశారు. రాజ్యాంగం అంశాలు విద్యార్థులకు, పోటీ పరీక్షలు రాసే వారికి ఉపయోగపడతాయని వితరణ చేసినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా గ్రంథాలయం ఛైర్మన్ ఉపేందర్‌రెడ్డి, సెక్రటరీ పద్మజలు.. ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కోల్ల సుధాకర్, రాంనారాయణ, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.